క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో ఎంపీ మిథున్



ఇంద్రకీలాద్రి(విజయవాడ): లోక్‌సభ ప్యానల్ స్పీకర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కుటుంబ సమేతంగా మంగళవారం విజయవాడ కనక దుర్గమ్మను దర్శించుకున్నారు. అలాగే కృష్ణా జిల్లా మోపిదేవిలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

గొడుగుల వితరణ



చిరు వ్యాపారికి గొడుగు అందిస్తున్న ప్రత్యేక రాయలసీమ సాధన సమితి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: వేసవి నేపథ్యంలో ఎండలో ఇబ్బంది పడుతున్న ఫుట్‌పాత్‌పై చిరువ్యాపారం చేసుకునే మహిళలకు ప్రత్యేక రాయలసీమ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కూరపాటి సురేష్ మంగళవారం గొడుగులు ఉచితంగా అందజేశారు. చిరు వ్యాపారులతో పాటు చెప్పులు కుట్టుకునే సుమారు 30 మందికి గొడుగులు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలో బతుకుదెరువు కోసం ఫుట్‌పాత్‌లపై పూలు అమ్ముకుంటూ, చెప్పులు కుట్టుకునే వారికి నీడ కోసం గొడుగులు అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక రాయలసీమ సాధన సమితి ప్రతినిధులు నాగరాజురెడ్డి, అబ్దుల్ రఫీ, సురేష్, సుదర్శన్ పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జడ్జి వాణిశ్రీ

తిరుపతి లీగల్: తిరుపతి మండల న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వాణిశ్రీ మంగళవారం స్థానిక ఎస్టీ వెల్ఫేర్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులకు అందుతున్న ఆహార పదార్థాలను, ఇతర వసతులను పరిశీలించారు. వివిధ అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

గోదాలక్ష్మికి డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ హోమ్‌సైన్స్ విభాగపు విద్యార్థిని కే.గోదాలక్ష్మికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ మంగళవారం తెలిపారు. ఆమె ప్రొఫెసర్ కే.అనురాధ పర్యవేక్షణలో అప్రైస్‌మెంట్ ఆఫ్ ఎగ్జిస్టింగ్ ఫ్రీ స్కూల్స్ ఇన్ టర్మ్స్ ఆఫ్ క్వాలిటీ స్టాండర్డ్స్ అనే అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించారు.

హజరతయ్యకు డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ తెలుగు విభాగానికి చెందిన విద్యార్థి టి.హజరతయ్యకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన ప్రొఫెసర్ పేట శ్రీనివాసులు పర్యవేక్షణలో రారా కాల్పనిక సాహిత్యం-పరిశీలన అనే అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించారు.

24న ఉచిత సామూహిక వ్రతాలు



మాట్లాడుతున్న శ్రీవారి సేవకులు అసోసియేషన్ కార్యదర్శి నరసింహులు

తిరుపతి కల్చరల్: మాఘమాసం పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 24వ తేదీన కొత్తవీధిలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీసత్యనారాయణస్వామివారి ఉచిత సామూహిక వ్రత పూజలు నిర్వహిస్తున్నట్లు శ్రీవారి సేవకులు అసోసియేషన్ కార్యదర్శి, శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ కార్యదర్శి దిండుకుర్తి నరసింహులు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ, శ్రీవారి సేవకులు అసోసియేషన్, ఆర్య వైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అత్యంత వేడుకగా సామూహిక వ్రత పూజలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పూజల్లో పాల్గొనే భక్తులకు అన్నవరం స్వామివారి రాగిమాడ గవించ, స్వామివారికి నివేదించే ప్రసాదం అందజేస్తామన్నారు. అన్నవరం క్షేత్రం నుంచి విచ్చేసే వేద పండితులచే ఈ సామూహిక వ్రత పూజలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు. ఇందులో పాల్గొనదలచిన వారు తమ పేర్లను నమోదు చేసుకోవడానికి 9494785500, 9394707487 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈనెల 23వ తేదీ శుక్రవారంలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. శ్రీవారి సేవకుల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

చంద్రగిరి : ఇంటి వద్ద ఉంచిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. ఏ.రంగంపేట సమీపంలోని ఎంబీయూలో కిషోర్ అనే యువకుడు ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పుల్లయ్యగారిపల్లె సమీపంలో ఓ గదిని అద్దెకు తీసుకుని తన స్నేహితులతో కలసి ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఎప్పటిలాగే తన ద్విచక్ర వాహనాన్ని గది సమీపంలో ఉంచాడు. మంగళవారం ఉదయం 6 గంటలకు బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెప్పపై ఆండాళ్ సమేత శ్రీకృష్ణుడి విహారం





తెప్పపై కొలువై పూజలందుకుంటున్న శ్రీఆండాళ్ సమేత శ్రీకృష్ణుడు, పుష్కరిణిలో తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షిస్తున్న శ్రీఆండాళ్ సమేత శ్రీకృష్ణుడు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి తెప్పోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం సాయంత్రం తెప్పపై శ్రీఆండాళ్ సమేత శ్రీకృష్ణస్వామి తెప్పలపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనాలతో అభిషేకం చేశారు. అనంతరం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆండాళ్ సమేత శ్రీకృష్ణస్వామి వారు విద్యుద్దీపాలంకరణలతో ప్రత్యేకంగా రూపొందించిన తెప్పను అధిరోహించి పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. అనంతరం ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల భక్తి సంకీర్తనలు, భజనలు భక్తులను అలరించాయి. బుధవారం, గురువారం, శుక్రవారం మూడు రోజుల పాటు శ్రీగోవిందరాజస్వామివారు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో కలిసి తెప్పను అధిరోహించి పుష్కరిణిలో ఏడు చుట్లు చుట్టి భక్తులకు దర్శనమిస్తారు. కార్యక్రమంలో తిరుమల చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నారాయణ, టెంపుల్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ బుక్‌లెట్ ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, జేఈఓ వీరబ్రహ్మం

తిరుపతి(అలిపిరి): శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 29 నుంచి మార్చి 8వ తేదీ వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఫిబ్రవరి 28వ తేదీ సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా ఫిబ్రవరి 29న ధ్వజారోహణం (మీనలగ్నం), మార్చి 4న గరుడ వాహనం, మార్చి 5న స్వర్ణరథం, మార్చి 7న రథోత్సవం, మార్చి 8న చక్రస్నానం నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఎఫ్ఏసీఏఓ బాలాజీ, సీఏఓ శేషశైలేంద్ర, చీఫ్ పీఆర్వో డా.టి.రవి, ఆలయ ప్రత్యేకశ్రేణి డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, రవాణా జీఎం శేషారెడ్డి, డెప్యూటీ ఈఓ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి

తిరుపతి(అలిపిరి): హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ బ్రహ్మోత్సవాల గోడపత్రికలను మంగళవారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పద్మావతీపురంలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ ఆలయంలో మార్చి 8 నుంచి 16వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. మార్చి 7వ తేదీ సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తారు. మార్చి 17న సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు పుష్పయాగం జరుగనుంది. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో ఎం.రమేష్‌బాబు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే భూమన

తిరుపతి తుడా: నగరంలోని 44వ డివిజన్ మధురా నగర్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్లను టీటీడీ చైర్మన్, తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకరరెడ్డి చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్థానిక కార్పొరేటర్ వరికుంట్ల నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ రూ.41 లక్షల వ్యయంతో మధురా నగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పైప్ లైనును ప్రారంభించామన్నారు. రెండేళ్ల ముందు వచ్చిన భారీ వర్షాలకు మధురా నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని, కౌన్సిల్ ఆమోదంతో నూతన డ్రైనేజీని నిర్మించామన్నారు. తిరుపతి అభివృద్ధికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సూచనలతో తమ కౌన్సిల్ సభ్యులు, కమిషనర్ సహకారంతో నిరంతరం పని చేస్తున్నామని మేయర్ తెలిపారు. అడిషనల్ కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డీఈ విజయకుమార్ రెడ్డి, నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, నాగిరెడ్డి, దేవదానం, యోగాంజనేయ రెడ్డి, అశోక్ రెడ్డి, లవ్లీ వెంకటేష్, తలారి రాజేంద్ర, శ్యామల, పునీత, కాంట్రాక్టర్ బొగ్గుల వెంకటేష్ పాల్గొన్నారు.

రవిశంకర్‌కు పరామర్శ



తిరుపతి మంగళం : పసుపులేటి రవిశంకర్‌కు మెరుగైన వైద్యసేవలందించాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి డాక్టర్లకు సూచించారు. తిరుపతి గిరిపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రవిశంకర్ అనారోగ్యంతో స్విమ్స్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న భూమన కరుణాకరరెడ్డి మంగళవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ధైర్యం చెప్పారు.

శ్రీవారి భక్తుడిని కాపాడిన పోలీసులు



సాయి హర్షను కుటుంబీకులకు అందజేస్తున్న పోలీసులు

తిరుమల: అవ్వాచారి కోనలో దూకేందుకు ప్రయత్నించిన శ్రీవారి భక్తుడిని తిరుమల టూ టౌన్ పోలీసులు కాపాడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. టూ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. విజయవాడకు చెందిన సాయిహర్ష(32) శ్రీవారి దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నాడు. సప్తగిరి గెస్ట్ హౌస్‌లో గది అద్దెకు తీసుకున్నారు. ఈ సమయంలో భార్యాభర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో మనస్తాపానికి గురైన సాయిహర్ష భార్యకు చెప్పకుండా వేకువజామున నాలుగు గంటలకు వెళ్ళిపోయాడు. ఉదయం 10 గంటల సమయంలో తిరుమలకు వెళ్లే నడకదారిలో డిస్‌ప్లే బోర్డులో ఉన్న సీఐ సత్యనారాయణ నంబర్‌కు కాల్‌చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన సీఐ తమ సిబ్బందితో కలసి సాయిహర్ష ఉన్న ప్రాంతానికి వెళ్లి అతన్ని పట్టుకుని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పట్టణంలో ప్రతి కాలనీని అభివృద్ధి చేస్తాం



47వ డివిజన్ జర్నలిస్టు కాలనీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి పట్టణంలోని ప్రతి కాలనీని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తానని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త, నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి అన్నారు. తిరుపతిలోని 47వ డివిజన్ ఎస్ఆర్ శంకరన్ జర్నలిస్టు కాలనీలో మంగళవారం రాత్రి ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ తిరుపతిని అగ్రస్థానంలో నిలపాలన్న సంకల్పంతో బృహత్ప్రణాళికలను రూపొందించామన్నారు. అందుకు అనుగుణంగానే పక్కా ప్రణాళికలతో అభివృద్ధి చేసి చూపిస్తున్నట్లు చెప్పారు. జర్నలిస్ట్ కాలనీలో రూ.2 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, యూడీఎస్, వాటర్‌లైన్, మురుగు కాలువలను నిర్మించామని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని ఆధునిక సౌకర్యాలను కచ్చితంగా కల్పించి తీరుతానని హామీ ఇచ్చారు. అలానే తిరుపతిలోని ప్రతి కాలనీ, నగర్, వీధిని అభివృద్ధి చేస్తామని, అలాగే ఈ ప్రభుత్వం మీకు జరిగింటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఆయన స్థానిక ప్రజలను కోరారు. గత పాలకులు తిరుపతికి ఏమి చేశారు ? కేవలం నాలుగన్నరేళ్లలో తాము ఏమి చేశామో? ప్రతి ఒక్కరూ పరిశీలన చేసుకుని ఓటు వేయాలని కోరారు.

కార్పొరేటర్ కోటేశ్వరమ్మ మాట్లాడుతూ 47వ డివిజన్‌ను భూమన అభినయరెడ్డి సహకారంతో అన్నివిధాలా అభివృద్ధి చేశామని తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ కాలనీకి చెందిన పలువురు జర్నలిస్టులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఏఆర్ వెంకటేష్, మధుసూదన్ నాయుడు, డిష్ రమణ, సురేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్పొరేటర్ కోటేశ్వరమ్మ మాట్లాడుతూ 47వ డివిజన్‌ను డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి సహకారంతో అన్నివిధాలా అభివృద్ధి చేశామని చెప్పారు. జర్నలిస్ట్ కాలనీ తన డివిజన్‌లో ఉండడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆమె తెలిపారు.

నిజం అంటే జగన్.. అబద్ధం అంటే చంద్రబాబు

- శ్రీవారి సేవలో మంత్రి కారుమూరి



తిరుమల శ్రీవారి ఆలయం వెలుపల మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తిరుమల: ''నిజం అంటే జగన్.. అబద్ధం అంటే చంద్రబాబు'' అని ప్రజలే చెబుతున్నారని మంత్రి కారుమూరి నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి మంత్రి స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా, అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. అనంతరం ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు. సీఎం ప్రవేశ పెట్టిన పథకాల ద్వారా ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు నాడు-నేడు ద్వారా మరింత మంచి జరగాలని కోరుకున్నానని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజలు జగన్‌మోహన్ రెడ్డే కావాలి - రావాలి కోరుకుంటున్నారని అన్నారు. చంద్రబాబు పాలనలో సంక్షేమం శూన్యమన్నారు. తెలంగాణను తగలేసి ఏపీని తగులబెట్టడానికి షర్మిల వచ్చారని ఎద్దేవా చేశారు.

రాజకీయ లబ్ధి కోసమే టీటీడీపై దుష్ప్రచారం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేత పసుపులేటి సురేష్

- బీజేపీ నేత భానుప్రకాష్‌పై వైఎస్సార్‌సీపీ నేతల మండిపాటు

తిరుపతి కల్చరల్: తన రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన టీటీడీ క్షేత్రంపై, ఈఓ ధర్మారెడ్డిపై దుష్ప్రచారానికి పాల్పడుతూ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు ధ్వజమెత్తారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేత పసుపులేటి సురేష్, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్, వైఎస్సార్ సేవాదళ్ నేత అరుణ్‌యాదవ్ మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతిగా ఏనాడు పార్టీ కోసం పని చేసిన దాఖలాలు లేవన్నారు. బీజేపీ నేతగా ఉంటున్న ఆయన ప్రపంచ ప్రసిద్ధి గాంచిన టీటీడీపై నిరంతరం తప్పుడు ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నాలకు పూనుకుంటున్నారు. టీటీడీలో తన వ్యాపారాలు సాగలేదన్న అక్కసుతో తప్పుడు ప్రచారాలతో దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తన స్వలాభం కోసం ఢిల్లీలో బీజేపీ నేతలను కలిసేందుకు వెళ్లిన ఆయన అక్కడ ప్రెస్‌మీట్ పెట్టి టీటీడీపై, టీటీడీ ఈఓ ధర్మారెడ్డిపై అసత్యపు ఆరోపణలు చేయడం చూస్తే భానుప్రకాష్‌కు పిచ్చి పరాకాష్టకు చేరిందన్నారు. గతంలో టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉన్న సమయంలో దర్శన టిక్కెట్లు, వీఐపీ లేఖలతో దోచుకుని నేడు విలాసవంతమైన జీవనం సాగిస్తున్న ఆయన విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. నిజాయితీగా, టీటీడీ అభివృద్ధి కోసం టీటీడీ ఈఓపై తప్పుడు విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్‌రెడ్డి, ఆనంద్, కిరణ్ రాయల్ పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



తనిఖీలు చేస్తున్న నగర పాలకసంస్థ హెల్త్ ఆఫీసర్

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని తిరుపతి నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి హెచ్చరించారు. నగర పాలక సంస్థ కమిషనర్ అతిధిసింగ్ ఆదేశాల మేరకు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి ఆధ్వర్యంలో మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శానిటరీ కార్యదర్శులు, మేస్త్రీలు కలిసి ఆయా వార్డుల్లో హోల్‌సేల్, రిటైల్ షాపుల్లో, మార్కెట్లు, హోటళ్లు, వీధి వ్యాపారస్తుల వద్ద తనిఖీ చేపట్టారు. నిబంధనలను అతిక్రమించిన వారికి అపరాధ రుసుం విధించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వస్తువులు, క్యారీ బ్యాగులు, నాన్ ఓవెన్ క్యారీ బ్యాగులు 60 జీఎస్‌లోపు ఉన్న 122 కేజీలు సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సీజ్ చేసిన 122 కేజీల ప్లాస్టిక్ వస్తువులకు సుమారు రూ.60 వేలు అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. ఇకపై సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులు, 120 మైక్రాన్ లోపు క్యారీ బ్యాగులు, నాన్ ఓవెన్ క్యారీ బ్యాగులు ఉత్పత్తి చేయరాదని, నిల్వ చేయకూడదని, అమ్మరాదని అలా చేస్తే వరుసగా ఉత్పత్తిదారులకు మొదటిసారి రూ.5 వేలు, రెండవసారి రూ.15 వేలు, మూడవసారి రూ.25 వేలు అపరాధ రుసుం విధిస్తామన్నారు.

యువతకు ఉద్యోగ..ఉపాధికి అడుగులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్ : యువతకు ఉద్యోగ.. ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ తిరుపతి స్పెషల్ జోన్‌లోని పరిశ్రమలకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2023-24లో జిల్లాలో నెలకొల్పిన ఏడు మెగా పరిశ్రమలు ఉత్పత్తులను ప్రారంభించాయన్నారు. ఇదే క్రమంలో అన్ని పరిశ్రమల్లోను ఉత్పత్తులు మొదలుపెట్టేలా చర్యలు చేపట్టాలని, తద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సూచించారు. ఎంఎస్ఎంఈ 9899 యూనిట్ కింద ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని, పీఎంఈజీపీ పథకం లక్ష్యాల మేరకు సకాలంలో పనులు చేపట్టడానికి బ్యాంకర్లతో అధికారులు సమన్వయం చేసుకోవాలని కోరారు .సింగిల్‌విండో ద్వారా పరిశ్రమల స్థాపనకు 637 అనుమతులకు గాను ఇప్పటికే 593 మంజూరు చేశామని వివరించారు. మిగిలిన అనుమతులు సకాలంలో మంజూరు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే పెయింటింగ్, వుడ్ కార్వింగ్, కాపర్ క్లస్టర్‌లను గుర్తించామని, ఇంకా కొత్త క్లస్టర్ల ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని స్పష్టం చేశారు. పీఎం విశ్వ కర్మ అప్లికేషన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ తిరుపతి చంద్ర శేఖర్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, డీపీఓ రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి పాల్గొన్నారు.


సమాజ సేవే ఎన్ఎస్ఎస్ వలంటీర్ల లక్ష్యం



పోటీల్లో పాల్గొని బహుమతులు పొందిన విద్యార్థినులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ : ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజ సేవే లక్ష్యంగా పనిచేయాలని పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు పలు అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రధాన మంత్రి వికసిత్ భారత్ ప్రణాళికలను విద్యార్థినులు ముందుకు తీసుకుపోవాలని సూచించారు. ప్రధానమంత్రి పంచప్రాణ్‌లో భాగంగా విద్యార్థినులకు వక్తృత్వ పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి విద్యార్థినీ కృషి చేయాలని కోరారు. అనంతరం పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థినులకు ఆమె జ్ఞాపికలను, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ కృష్ణవేణి, అధ్యాపకులు దివ్యవాణి, భువనేశ్వరి, కే మల్లీశ్వరి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

మెకానిక్‌లకు చేయూత



మాట్లాడుతున్న ఆవుల మునిరెడ్డి

తిరుపతి కల్చరల్: టూవీలర్స్ మెకానిక్ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తోందని తిరుపతి టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం గాంధీ భవన్ ఆవరణలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానిక్‌ల కార్మికుల అభ్యున్నతి కోసం అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు, నాయకుల సమన్వయంతో చేయూతనిస్తున్నట్లు చెప్పారు. అలాగే టాటా ఇన్సూరెన్స్ కంపెనీ తరఫున ప్రతి కార్మికుడు రూ.390 చెల్లిస్తే రూ.5లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కాప్సోల్ ఆయిల్స్ డీలర్ శశికాంత్ శెట్టి అసోసియేషన్‌కు రూ.15 వేలు విరాళంగా అందజేశారు. అనంతరం ఇటీవల ప్రమాదానికి గురైన భాకరాపేట మెకానిక్ లక్ష్మీనారాయణకు చికిత్స కోసం రూ.10వేలు, కొర్లగుంటకు చెందిన మెకానిక్ తేజారెడ్డి అత్యవసర ఆపరేషన్‌కు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఆసుపత్రి అభివృద్ధికి సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

భాకరాపేట : ప్రభుత్వ ఆసుపత్రికి అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని మాజీ జడ్పీ చైర్మన్ వలసారెడ్డి సిద్ధరామిరెడ్డి కుమారుడు వి.శివప్రసాద్‌రెడ్డితో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆసుపత్రి భవనాన్ని రూ.7 కోట్లుతో నిర్మించామన్నారు. నాడు నేడు కింద భవనాన్ని అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో వైద్యాధికారి శ్రీధర్, షీలాభాను, సర్పంచ్ మనోహర్, మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఖదీర్‌అహ్మద్, మార్కెట్ యార్డు డైరెక్టర్ బావాజీ తదితరులు పాల్గొన్నారు.

రాగి జావ మంచి పౌష్టికాహారం



రాగి జావాను విద్యార్థులకు అందిస్తున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో అందిస్తున్న రాగి జావ మంచి పౌష్టికాహారమని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. మంగళవారం పాకాల పట్టణంలోని ఎస్‌వీఎస్ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్నం విద్యార్థులకు అందిస్తున్న రాగి జావను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూలో భాగంగా ప్రతీ సోమ, బుధ, శుక్రవారాలలో విద్యార్థులకు చిక్కీలు, మంగళ, గురు, శనివారాలలో రాగి జావ అందిస్తున్నారని పేర్కొన్నారు. రాగి జావను తాగడానికి ప్రభుత్వం గ్లాసులను కూడా సరఫరా చేసిందని, జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని బాగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయులు బాలసుబ్రమణ్యం, రమేష్, శ్రీలక్ష్మి, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

తిరుచానూరు ఏవీఎస్‌ఓగా సతీష్‌కుమార్



ఏవీఎస్ఓ సతీష్ కుమార్

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ ఏవీఎస్‌ఓగా సతీష్‌కుమార్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ముందుగా ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం తన కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల సెక్టార్–3 నుంచి ఇక్కడికి బదిలీపై రావడం సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి దర్శనార్థం వచ్చే సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తూ, మెరుగైన దర్శన భాగ్యం కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అధికారులు, సిబ్బంది కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రాయలచెరువు పేటలో సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ సమావేశం

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు పేట గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ సర్పంచి మురగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం డీఆర్పీ హరిబాబు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు రూ.54 లక్షల వ్యయంతో 48 పనులు జరిగినట్లు తెలిపారు. ఈ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ తనిఖీ నివేదికలను బహిరంగంగా గ్రామస్తులకు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జేఈ మమత, టీఏలు ఆరోగ్య మేరీ, రమేష్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ



తిరుపతి లీగల్: తిరుపతి మండల న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వాణిశ్రీ మంగళవారం స్థానిక ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులకు అందుతున్న ఆహార పదార్థాలను, ఇతర వసతులను పరిశీలించారు.

గోరుముద్దతో కొండంత బలం

నాడు.. ప్రభుత్వ పాఠశాలలంటే చీదరించుకునే పరిస్థితి ఉండేది. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పిల్లలంటే చిన్నచూపు ఉండేది. ప్రభుత్వ పాఠశాలంటే శిథిలావస్థలో ఉంటూ ఏ క్షణాన కూలిపోతుందో అనే భయం ఉండేది. ప్రభుత్వ పాఠశాలంటూ అరకొర వసతులు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడాల్సి వచ్చేది. మధ్యాహ్న భోజనం అంటే గడ్డకట్టిన అన్నం, నీళ్ల సాంబారు. అది తిన్న విద్యార్థులు ఆసుపత్రి పాలు ఇదీ గతంలో ప్రభుత్వ పాఠశాలలో దుస్థితి.

మరి నేడు... ఒకే ఒక్క జీఓతో ప్రభుత్వ పాఠశాలల తలరాతను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమూలంగా మార్చాడు. అదే ప్రభుత్వ పాఠశాలల ముందు అడ్మిషన్లు అయిపోయాయి అని బోర్డులు ఏర్పాటు చేసేంత అభివృద్ధి చేసి చూపించాడు. నాడు–నేడు కింద పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు మరుగుదొడ్ల నుంచి డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసేంత వరకు అభివృద్ధి చేసింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఏ ఒక్క విద్యార్థి ఇంటి నుంచి లంచ్‌బాక్సు తీసుకురాకుండా పోషకాహారాన్ని అందిస్తూ విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్ మామయ్యగా మారాడు.

- రోజుకో మెనూతో విద్యార్థులకు పౌష్టికాహారం
- అదనంగా చిక్కీలు, రాగి జావ
- రుచికరం, బలవర్థకమైన ఆహారం అంటున్న విద్యార్థులు
- ప్రభుత్వ పాఠశాలలో జగనన్న గోరుముద్దతో విద్యార్థుల ఆనందం



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ లలిత కుమారి



భోజనం కోసం క్రమపద్ధతిలో వెళ్తున్న విద్యార్థులు

చంద్రగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన, బలవర్థకమైన పోషకాహారాన్ని అందించాలని సంకల్పించారు. దీంతో జగనన్న గోరుముద్ద పేరుతో పిల్లలకు రుచికరంగా మధ్యాహ్న భోజనం అందించేందుకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రోజు విద్యార్థులకు మెనూ మార్చుతూ.. రోజుకో రకం ఆహారాన్ని అందిస్తోంది ప్రభుత్వం. పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనం ఇంటిని మించి రుచికరంగా ఉండడంతో విద్యార్థులు సైతం ఆనందంగా ఆరగిస్తున్నారు. వారంలో ఐదు రోజులు కోడిగుడ్లు, మూడు రోజులు చిక్కీ, మూడు రోజులు రాగిజావను అదనంగా మెనూలో చేర్చడంతో విద్యార్థులు శారీరక ఎదుగుదలకు దోహదపడుతోందని పాఠశాల ఉపాధ్యాయులు చెబుతున్నారు. మానసికంగా కూడా వారిని మరింత చురుగ్గా తయారు చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలను తీసుకుంటోంది. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ నిరంతరం మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించేలా ఆయా ఎంఈఓలు పర్యవేక్షిస్తున్నారు. జగనన్న గోరుముద్ద తిన్న విద్యార్థులు, గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి ఎంతో తేడా ఉందని, జగన్ మామయ్య మాకు అందిస్తున్న ఆహారం చాలా బాగుందంటూ కితాబునిస్తున్నారు.



మధ్యాహ్నం భోజనం మెనూ కార్డు



విద్యార్థుల సహపంక్తి భోజనం

మధ్యాహ్న భోజంన మెనూ

- **సోమవారం:** వేడి పొంగలి, ఉడికించిన కోడిగుడ్డు లేదా కూరగాయల పలావ్, చిక్కీ, గుడ్డుకూర
- **మంగళవారం :** చింతపండు పులిహోర, టమాట పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ
- **బుధవారం :** కూరగాయల అన్నం, బంగాళదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
- **గురువారం :** సాంబార్ బాత్ లేక లెమెన్ రైస్, టమాట పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ
- **శుక్రవారం :** అన్నము, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
- **శనివారం :** ఆకుకూర పప్పు లేదా ఆకుకూరలతో అన్నం, పప్పుచారు, తీపి పొంగలి, రాగిజావ

పిల్లలంటే జగన్ మామయ్యకు చాల ఇష్టమనుకుంటాను



సీఎం వైఎస్ జగన్ మామయ్యకు మాలాంటి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లలంటే చాలా ఇష్టమని అనుకుంటాను. అందుకేనేమో ఏమీ అడగకుండానే తల్లిదండ్రుల స్థానంలో నిలచి మాకు అన్నీ ఇస్తున్నాడు. చివరకు మాకు పెట్టే అన్నంలోనూ ఆయన రాజీ పడడం లేదు. ఏ రోజున ఏది తినాలి.. ఎలా తినాలి.. ఎంత తినాలి.. ఎందుకు తినాలి అని ఉపాధ్యాయులు మాకు నిత్యం కౌన్సెలింగ్ ఇస్తూనే ఉన్నారు. పిల్లల ఆరోగ్యంపై ప్రభుత్వం ఇంత శ్రద్ధ పెట్టడం ఆనందంగా ఉంది. – వర్షిత్, 9వ తరగతి, నరసింగాపురం

అడిగినంత పెడుతున్నారు..



నేను ఈ సంవత్సరమే ఇక్కడ చేరాను. మధ్యాహ్నం మాకు వడ్డించే ఆహారం చాలా రుచికరంగా ఉంటోంది. సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతి రోజు కోడిగుడ్డు పెడతారు. దాంతో పాటు మూడు రోజులు రాగిజావ, మూడు రోజులు చిక్కీలను కూడా అందిస్తున్నారు. రుచికరంగా ఆహారం ఉండడంతో తిరిగి ఎంత అడిగినా విసుక్కోకుండా అడిగినంత కడుపునిండా పెడుతున్నారు. చాలా ఆనందంగా ఉంది.
– రాకేష్, 6వ తరగతి, నరసింగాపురం

గతంలో ఎన్నడూ లేని విధంగా...



ఇంతకుముందు ప్రభుత్వాలు గురించి నాకు తెలియదు. కానీ మా అమ్మనాన్న, ఊర్లో వాళ్లు చెబుతున్నారు. ఇప్పటిలాగా గతంలో ఏ ప్రభుత్వం మాలాంటి పేద విద్యార్థుల భోజనం కోసం ఇంతలా ఖర్చు పెట్టిన దాఖలాలు లేవని. ఇప్పుడు అవి నిజమే అనిపిస్తోంది. సీఎం వైఎస్ జగన్ మామయ్య మాపై ప్రేమతో కల్తీ, నాణ్యత లోపాలకు ఏ మాత్రం ఆస్కారం ఇవ్వకుండా మాకు పోషకగుణాలు కలిగిన పప్పు, సాంబారు, ఆకుకూరలు, రాగి జావ, కోడిగుడ్డు, చిక్కీలు, పులిహోర ఇలా ఒకటేమిటి సోమవారం నుంచి శనివారం వరకు రోజుకో వెరైటీను మాకు అందిస్తున్నారు. బహుశా ఇంట్లో అమ్మ కూడా ఇంత ఓపిగ్గా మాకు చేసిపెట్టదేమో అనిపిస్తోంది.
– హేమలక్ష్మి, 7వ తరగతి, నరసింగాపురం

ఇంత అభివృద్ధి ఎప్పుడూ చూడలేదు



ప్రభుత్వ పాఠశాలల్లో ఇంత పెద్ద ఎత్తున జరిగిన అభివృద్ధిని నా సర్వీసులో ఎప్పుడూ చూడలేదు. నేను గతంలో పీలేరు పరిసర ప్రాంతాల్లో పనిచేశాను. 9 నెలల క్రితం నరసింగాపురం ప్రభుత్వ పాఠశాలకు బదిలీపై వచ్చాను. ఇక్కడ సుమారు 125 మంది పిల్లలు చదువుకుంటున్నారు. వారితో నిత్యం మమేకమై వారి అవసరాలను, మధ్యాహ్నం అందిస్తున్న భోజనంపై ఆరా తీస్తుంటాను. ఏ రోజు కూడా భోజనం బాగా లేదు అనే ఫిర్యాదు నా దృష్టికి రాలేదు. నిత్యం ప్రభుత్వం పిల్లలకు కావాల్సిన సరుకులలో నాణ్యతను పాటిస్తూ అందిస్తున్నారు.
– రామమూర్తి, హెచ్‌ఎం, నరసింగాపురం

ఓటు హక్కు లేదని ఇన్నాళ్లు వీరిని విస్మరించారు



ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఓటు హక్కు లేదని గత ప్రభుత్వం వీరిని విస్మరించింది. అయితే జగనన్న సీఎం అయ్యాక భావితరాలకు దిక్సూచిగా నిలబడే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు. అన్నిటికంటే జగనన్న గోరుముద్ద పథకం పేద పిల్లలకు గొప్పవరం. రోజుకొక రుచితో పాటు పోషకాహారాన్ని అందిస్తూ సంపూర్ణ ఆరోగ్యంగా ఎదిగేందుకు మధ్యాహ్న భోజనం పెట్టడం సంతోషంగా ఉంది. ఇంత గొప్ప నాయకుడి వెంట ప్రతి ఒక్కరూ నిలబడాలి.
– ఎం. అశ్విని, ఎంపీటీసీ, నరసింగాపురం

2 నుంచి ముక్కోటిలో మహా శివరాత్రి ఉత్సవాలు



శ్రీఅగస్త్యేశ్వర స్వామివారి ఆలయం

చంద్రగిరి: శ్రీఅగస్త్య మహామునిచే ప్రతిష్ఠించబడి, స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వర స్వామివారి(ముక్కోటి) ఆలయంలో మహా శివరాత్రి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తారన్నారు.

కార్యక్రమ వివరాలు

మార్చి 2వ తేదీన సాయంత్రం అంకురార్పణ, మూషిక వాహనంపై వినాయక స్వామివారి ఊరేగింపు చేపట్టనున్నారు. 3న ఉదయం మయూర వాహనం, సాయంత్రం సింహ వాహనం, 4న ఉదయం శేష వాహనం, సాయత్రం భూత వాహనం, 5న ఉదయం స్వామివారికి శాకాంబరి అలంకరణ, సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 6న ఉదయం విభూది అభిషేకం, రథోత్సవం, సాయంత్రం కామధేను వాహనం, 7న ఉదయం అన్నాభిషేక మహోత్సవం, కల్పతరువు వాహనం, సాయంత్రం అధికార నంది వాహనం, 8వ తేదీన మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం ప్రదోషకాల పూజ, రాత్రి నంది వాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు, 9న లింగోద్భవ అభిషేకం, సాయంత్రం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, 10వ తేదీన ఉదయం రావణాసుర వాహనంపై స్వామి, అమ్మవార్లు భక్తులను కటాక్షించనున్నారు. అదే రోజు సాయంత్రం శయనోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయని ఆయన తెలిపారు.

భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు

మహాశివరాత్రి ఉత్సవాలను గతంకంటే గొప్పగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు, మంచినీళ్లు, ప్రసాదాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగినన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

24న ఉచిత సామూహిక వ్రతాలు

తిరుపతి కల్చరల్: మాఘమాసం పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 24వ తేదీన కొత్తవీధిలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీసత్యనారాయణస్వామివారి ఉచిత సామూహిక వ్రత పూజలు నిర్వహిస్తున్నట్లు శ్రీవారి సేవకులు అసోసియేషన్ కార్యదరి, శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ కార్యదర్శి దిండుకుర్తి నరసింహులు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. అత్యంత వేడుకగా సామూహిక వ్రత పూజలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పూజల్లో పాల్గొనే భక్తులకు అన్నవరం స్వామివారి రాగిమాడ గవించ, స్వామివారికి నివేదించే ప్రసాదం అందజేస్తామన్నారు. అన్నవరం క్షేత్రం నుంచి విచ్చేసే వేద పండితులతో వ్రత పూజలు నిర్వహిస్తామన్నారు. పాల్గొనదలచిన వారు తమ పేర్లను నమోదు చేసుకోవడానికి 9494785500, 9394707487 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈనెల 23వ తేదీ శుక్రవారంలోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

గంగమ్మకు సారె సమర్పణ



చంద్రగిరి: మండలంలోని మండపంపల్లెలో మంగళవారం గంగమ్మ జాతరను వేడుకగా నిర్వహించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గంగమ్మకు సారె సమర్పించారు. గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెప్పపై ఆండాళ్ సమేత శ్రీకృష్ణుడి విహారం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి తెప్పోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం సాయంత్రం తెప్పపై శ్రీఆండాళ్ సమేత శ్రీకృష్ణస్వామి తెప్పలపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనాలతో అభిషేకం చేశారు. అనంతరం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆండాళ్ సమేత శ్రీకృష్ణస్వామి వారు విద్యుద్దీపాలంకరణలతో ప్రత్యేకంగా రూపొందించిన తెప్పను అధిరోహించి పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. అనంతరం ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల భక్తి సంకీర్తనలు, భజనలు భక్తులను అలరించాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
వ్యవసాయ మార్కెటింగ్ శాఖ

ప్రకటన నెం. బి1/50/2024, తేది : 20-02-2024

వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నూతనముగా నిర్మించిన తిరుచానూరు రైతు బజారు నందు గల స్టాళ్ళను నియమ నిబంధనల మేరకు అద్దె ప్రాతిపదికన కేటాయించడానికి దరఖాస్తులు కోరడమైనది. దరఖాస్తు దారులు DWACRA/SHG సంఘంలో సభ్యులుగా యుండి మరియు సంఘం వారి నుండి ధృవపత్రములు పొందియుండవలయును మరియు సదరు తిరుచానూరు రైతు బజారు నందు నూతనముగా నిర్మించిన వాణిజ్య షాపులు బహిరంగ వేలము ద్వారా అద్దె ప్రాతిపదికన కేటాయించబడును. దరఖాస్తులను ది: 21-02-2024 నుండి 29-02-2024వ తేది వరకు స్వీకరించబడును.

ఇతర సమాచారం కొరకు, కార్యాలయపు పనివేళలో ఎస్టేట్ ఆఫీసర్, రైతు బజారు, తిరుచానూరు వారిని సంప్రదించగలరు.

సం/- జిల్లా వాణిజ్య మరియు మార్కెటింగ్ అధికారి, తిరుపతి	సం/- శ్రీయుత జిల్లా సంయుక్త కలెక్టర్, తిరుపతి.

జిల్లాలో బర్డ్ ఫ్లూ ఎక్కడా లేదు

- పెరటికోళ్లు, పౌల్ట్రీ ఫారాలను తనిఖీ చేసిన వెటర్నరీ సిబ్బంది

తిరుపతి రూరల్: జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ వ్యాధి లక్షణాలు బయట పడలేదని, ఎలాంటి ఆందోళన లేకుండా చికెన్, కోడి గుడ్లను తినవచ్చని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రవికుమార్ తెలిపారు. మంగళవారం తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాల పరిధిలోని పెరటి కోళ్లు, పౌల్ట్రీ ఫారంలను ఆయన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. కోళ్ల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించారు. ఎక్కడా అనారోగ్య లక్షణాలు కనిపించలేదని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు ఏడీ రవికుమార్ తెలిపారు. అనంతరం పౌల్ట్రీ రైతులకు అవగాహన కల్పించారు. బర్డ్ ఫ్లూ లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏదైన అత్యవసర పరిస్థితి నెలకొంటే ఎదుర్కొనేందుకు మూడు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పశువైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉన్నారన్నారు. కోళ్ల నుంచి ఇంతవరకు ఎలాంటి వ్యాధి మనుషులకు సంక్రమించలేదని, చికెన్, కోడి గుడ్లను నిరభ్యంతరంగా తినవచ్చని తెలిపారు. వెటర్నరీ వైద్యులు శైలజ, హరిత, సిబ్బంది పాల్గొన్నారు.



చంద్రగిరి: కోళ్ల ఫారంను తనిఖీ చేస్తున్న పశువైద్యాధికారులు



పాకాల: పౌల్ట్రీ ఫారాలను సందర్శించిన పశువైద్యాధికారులు

పశు వైద్యాధికారుల పర్యటన

పాకాల: పలు గ్రామాల్లో పెరటి కోళ్లు, పౌల్ట్రీ ఫారాలను పశు వైద్యాధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏడీఏహెచ్ డాక్టర్ వి.శ్రీధర్ సూచనల మేరకు దామలచెరువు, కె.వడ్డేపల్లి, మొగరాల పశువైద్యాధికారులు డాక్టర్ వి.జానకమ్మ, డాక్టర్ జి.మోహనకుమారి, డాక్టర్ వై.బి.పవన్‌కుమార్‌లు నన్నూరివారిపల్లి, ఉప్పువంక, వెంకటరామాపురం, నగిరిఇండ్లతోపాటు పౌల్ట్రీ ఫారాలను సందర్శించారు.



తిరుపతి రూరల్ మండలం తనపల్లిలోని పౌల్ట్రీ ఫారంను తనిఖీ చేస్తున్న వెటర్నరీ ఏడీ రవికుమార్, సిబ్బంది

చంద్రగిరిలో...

చంద్రగిరి: బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాపిస్తున్న క్రమంలో మంగళవారం మండల పశువైద్యాధికారి డాక్టర్ వంశీ మండల పరిధిలోని మిట్టపాళెం, భీమవరం, కల్‌రోడ్డుపల్లి, మెండికాలువల్లోని పౌల్ట్రీ కోళ్ల ఫారంలు, పెరటికోళ్ల పెంపక కేంద్రాలను తనిఖీ చేశారు. బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని నిర్ధారణ చేశారు. బర్డ్ ఫ్లూ గురించి ఏ విధమైన ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కోళ్ల ఆరోగ్య విషయమై ఏదైనా అవాంఛనీయ పరిస్థితులు చోటు చేసుకుంటే వెంటనే పశు వైద్యాధికారులను సంప్రదించాలని సూచనలు చేశారు.